

గూడూ లేదు.. భూమీలేదు

ఇందిరమ్మ ఇళ్లతో తమకో గూడు దొరుకుతుందన్న పేదవారి ఆశలు అడియాశలవుతున్నాయి.

వివరాలు 8లో ▸



ఆదాయం కోసం ప్యాకేజీ అస్త్రం

నష్టాల బాటలో పయనిస్తున్న ఆర్టీసీ ఆదాయ మార్గాల కోసం పుణ్యక్షేత్రాల బాట పట్టింది.

వివరాలు 8లో ▸



విద్యార్థినులకు అస్వస్థత

న్యాల్‌కల్‌లోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యం లోపించొద్దు

డీపీఓ సాయిబాబా

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీపీఓ సాయిబాబా సూచించారు. మండల పరిధిలోని చేర్యాల గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. మురికి కాల్వలు,గుంతల్లో నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించి గ్రామంలో జరుగుతున్న పనుల వివరాలను కంప్యూటర్లో నమోదు చేయాలని సూచించారు.

సభ్యత్వ నమోదుకు స్పందన భేష్: తపస్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలో చేపడుతున్న తపస్ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి తెలిపారు. మండలంలోని గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులందరూ సభ్యత్వం తీసుకుని తపస్‌ను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌ను విరమించుకోండి



కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 163వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి గ్రామంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గ్రామస్తులు పాల్గొని నిరసనలు తెలుపుతున్నా స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు.

హాజరు శాతాన్ని పెంచాలి

జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సంక్షేమాధికారి లలితకుమారి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రమైన ఝరాసంగం మహాత్మా జ్యోతిబాపూలే బాలికల సంక్షేమ వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని ఆమె పరిశీలించి, పలు రికార్డులను, హాజరు పట్టీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వసతులపై ఆరా తీశారు. ఒకే రోజు 42 మంది విద్యార్థినులు గైర్హాజరు కావటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం: సీఐటీయూ

పటాన్‌చెరు టౌన్: సిగాచి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకూ సీఐటీయూ వారికి అండగా ఉండి పోరాడుతుందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య స్పష్టం చేశారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి రెండు వారాలైనా ఇప్పటికీ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందలేదని మండిపడ్డారు. గురువారం శ్రామిక భవన్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజయ్య పాల్గొని మాట్లాడారు. సిగాచి యాజమాన్యంపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి వెంటనే చట్టపరంగా శిక్షించాలన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌ను సందర్శించిన నేపాల్ బృందం

సంగారెడ్డి: సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రం (ఎఫ్ఆర్ఎస్)ను 27 మంది సభ్యులతో కూడిన నేపాల్ బృందం బుధవారం రాత్రి సందర్శించింది. తెలంగాణలో అమలవుతున్న వ్యవసాయ, అర్బన్, హార్టీకల్చర్ డెవలప్‌మెంట్ టెక్నాలజీని పదిరోజుల పాటు నేపాల్ బృందం ఇక్కడే ఉండి అధ్యయనం చేయనుంది. నేపాల్ బృందం వెంట కోర్స్ డైరెక్టర్ అంజన్ కుమార్, కోర్స్ కో ఆర్డినేటర్ శిరీష, ఎఫ్ఆర్ఎస్ అధిపతి డాక్టర్ సుచిత్ర, శాస్త్రవేత్తలు హరికాంత్, మాధవి, మౌనిక, నితీశ్ ఉన్నారు.

షరా మామూలే

అవినీతికి నిలయాలుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

- ఏసీబీ సోదాలు చేస్తున్నా ఆగని దందా
- చక్రం తిప్పుతున్న డాక్యుమెంట్ రైటర్లు
- నిత్యం రూ.లక్షల్లో చేతులు మారుతున్న ముడుపులు



కిటకిటలాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. అవినీతి నిరోధకశాఖ అధికారులు అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నప్పటికీ ఈ శాఖలో కొందరు అధికారుల వసూళ్ల దందా మాత్రం ఆగడం లేదు. ముడుపులు ముట్టజెప్పనిదే డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్ కావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది. 10 నెలల క్రితం సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమ రిజిస్ట్రేషన్ల దందా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. నోట్ల కట్టలను కార్యాలయం కిటికీలోంచి బయటకు విసిరేయడం కలకలం రేపింది. తాజాగా గురువారం సదాశివపేట ఎస్ఆర్ఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో నగదు పట్టుబడగా, కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు పట్టుబడ్డారు.

రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతున్న ముడుపులు..

అయా స్థిరాస్తి విలువను బట్టి ఒక్కో డాక్యుమెంట్‌కు కనీసం రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల చొప్పున ముడుపులు పుచ్చుకోవడం ఈ కార్యాలయాల్లో పరిపాటిగా తయారైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు (ఎస్ఆర్ఓ) ఉన్నాయి. అత్యధికంగా పటాన్‌చెరు జాయింట్-1, జాయింట్-2, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, మెదక్, సిద్దిపేట, గజ్వేల్ తదితర ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో ఎక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. ఒక్కో కార్యాలయంలో సగటున 30 నుంచి 90 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఏదైనా ముహూర్తం, మంచి రోజులు ఉన్న రోజుల్లో ఈ కార్యాలయాల్లో వందకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. ఈ లెక్కన ఒక్కో కార్యాలయంలో రోజుకు కనీసం 50 డాక్యుమెంట్లకు రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ముడుపులు చేతులు మారుతున్నాయి. డాక్యుమెంట్ల సంఖ్య ఎక్కువ ఉన్న రోజుల్లో కొన్ని కార్యాలయాల్లో రూ.ఐదు లక్షలకు మించి ముడుపులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి.

డాక్యుమెంట్ రైటర్లే కీలకం..

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అక్రమాలకు కొందరు డాక్యుమెంట్ రైటర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్ రైటర్లు, దళారులు రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి వెళ్లకూడదు. కానీ వీరు ఏకంగా ఎస్ఆర్ఓల క్యాబిన్లలోకే దర్జాగా చొచ్చుకుని పోయి..పక్కనుంచి మరీ రిజిస్ట్రేషన్లు చేయిస్తుండటం పరిపాటైపోయింది. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ విధానం వంటి సంస్కరణలు ప్రభుత్వం తెస్తున్నప్పటికీ ఈ కార్యాలయాల్లో అక్రమాలు మాత్రం ఆగకపోవడం గమనార్హం.

వివాదాస్పద డాక్యుమెంట్లతో కాసుల పంట

వివాదాస్పదమైన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు ఈశాఖ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇలాంటి ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.లక్ష చొప్పున ముడుపులు పుచ్చుకుని రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు గతంలో వెల్లువెత్తాయి. లింకు డాక్యుమెంట్లు లేని స్థిరాస్తులు, కోర్టు వివాదాల్లో ఉన్న నివాస స్థలాలు, ఒకే భూమిలో రెండుసార్లు లేఅవుట్ చేసిన ప్లాట్లు, అనుమతి లేని లేఅవుట్‌లలో స్థలాలు, ఎల్ఆర్ఎస్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లు ఇలా వివిధ రకాల వివాదాస్పద డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లలో రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సదాశివపేట ఎస్ఆర్ఓలో ఏసీబీ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ దాడులు చేసింది. సుమారు ఏడు గంటల పాటు సాగిన తనిఖీల్లో పలు డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా డాక్యుమెంట్ రైటర్లను నేరుగా కార్యాలయంలోనికి అనుమతిస్తున్నారని వెల్లడైంది. డాక్యుమెంట్ రైటర్ల వద్ద నుంచి రూ.7,550లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అవినీతి నిరోధకశాఖ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ విలేకరులకు వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో పూర్తి చేయాల్సిన డ్యాకుమెంట్లు అసంపూర్తిగా ఉండటం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.



సాగు జలాలకు పూలు చల్లుతున్న మంత్రి దామోదర, (ఇన్‌సెట్) నీటిని విడుదల చేస్తున్న మంత్రి

సాగుకు సింగూరు నీళ్లు

లిఫ్టు ద్వారా నీటిని విడుదల చేసిన మంత్రి దామోదర

పుల్‌కల్(అందోల్): ఎట్టకేలకు సాగు కోసం సింగూరు జలాలు విడుదలయ్యాయి. సింగూరు జలాలను మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం పూజలు చేసి లిఫ్టు ద్వారా ఎడమకాలువకు నీటిని విడుదల చేశారు. కాలువలకు సిమెంట్ లైనింగ్ మరమ్మతుల కారణంతో క్రాప్ హాలిడే ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంగా రెండు పంటలకు సింగూరు నీటిని విడుదల చేయని సంగతి తెలిసిందే. అయితే సిమెంట్ లైనింగ్ పనులు నత్తనడకన నడుస్తుండటంతో స్థానిక రైతుల ఆందోళనలను, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం లైనింగ్ పనులకు తాత్కాలికంగా నిలిపి ఎట్టకేలకు సాగుకు సింగూరు జలాలు విడుదల చేసేందుకు నిర్ణయించింది. ఈ సాగు నీటి వల్ల పుల్‌కల్,అందోల్,చౌటకూర్ మండలాల రైతులకు లాభం చేకూరుతుంది. ఆయకట్టు కింద 40 వేల ఎకరాల్లో, 93 చెరువుల కింద మరో 10వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారు. సాగు నీటి విడుదల అనంతరం మంత్రి దామోదర సింగూరు గురుకుల, బస్వాపూర్ మోడల్, కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ పాఠశాలల ఆవరణలు చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా కనిపించడంతో ఆయా ప్రిన్సిపాళ్లను మంత్రి మందలించారు. ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పాఠశాలల్లో ప్రతీ తరగతి గదిని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో త్రిష దామోదర, నీటిపారుదల శాఖ ఈఈ జైభీమ్, డీఈ నాగరాజు, ఏఈలు మహిపాల్‌రెడ్డి, మహేశ్, తహసీల్దార్ కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

- రెండు నెలలుగా అందని నీళ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- గిరిజనులకు దిక్కైన వ్యవసాయ బోర్లు



బోర్ల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

హత్నూర (సంగారెడ్డి): ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్‌తో మిషన్ భగీరథ నీళ్లు అని ప్రజా ప్రతినిధులు, అధికారులు చేస్తున్న ప్రచారార్భాటాలు పటాటోపమేనని రుజువు చేస్తోంది హత్నూర మండలంలోని దేవునిగుట్ట తండావాసుల కన్నీటి గాథ. తండాకు మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోయి గత రెండు నెలలైనా ఈ గిరిజన వాసులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో తాగునీటికోసం వ్యవసాయ క్షేత్రాల్లోని బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ గిరిజన తండాలో సుమారు 300 జనాభాతో 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత ప్రభుత్వం ఈ దేవుని గుట్ట తండాను గిరిజన గ్రామపంచాయతీగా సైతం చేసింది. రక్షిత మంచినీటి ట్యాంక్ ఉన్నప్పటికీ చిన్నగా ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ రెండు నెలల క్రితం పగిలిపోవడంతో నీరు తండాకు రావడం లేదు. గిరిజనులు మిషన్ భగీరథ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకునేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడటంతో పాటుగా ఈ నీళ్లు తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మిషన్ భగీరథ త్రాగునీరు రాక రెండు నెలలైంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి కోసం ఇబ్బందులు పడుతూ పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్తున్నాం.

- వాలి, తండా వాసి

కొత్త పైప్‌లైన్ వేస్తాం

దేవుని గుట్ట గిరిజన తండాకు త్వరలోనే కొత్త పైప్ లైన్ వేస్తాం. రెండు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు ట్యాంకు ఎక్కడం లేదు. పైప్ లైన్ పగిలిపోవడంతో సమస్య తలెత్తింది.

-శివ ప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్‌బో మెడోస్ కాలనీలో మంచినీటి నల్ల కనెక్షన్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఐలాపూర్ గ్రామంలో రూ.పది లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాలలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.



మంచినీటి నల్ల కనెక్షన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

తండాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్. చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ తదితరులు

సంగారెడ్డి జోన్: గిరిజన తండాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, రోడ్లు భవనాలు, శిశు సంక్షేమ, విద్యా, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, జిల్లా గ్రామీణ సంస్థ, నీటిపారుదల, పరిశ్రమలు, రెవెన్యూ, పోలీస్, వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలు గిరిజన తండాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. దేశంలో పుట్టిన ప్రతీ వ్యక్తికి విద్యా, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ అధికారి అఖిలేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు జ్యోతి, లలిత కుమారి, జానకీ రెడ్డి, వసంత కుమారి, ఐనేష్ పాల్గొన్నారు.

10 నెలల్లో రోడ్డు, వంతెన పూర్తి చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): అంతకుముందు సిర్గాపూర్ మండలం గైరాన్ తండాను సందర్శించారు. తండాకు రోడ్డు, వంతెన నిర్మాణం పనులు 10 నెలల్లో పూర్తి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు. సిర్గాపూర్ మండలం గైరాన్ తండాలో గిరిజనులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. లేకుంటే అధికారులు న్యూఢిల్లీలో ఎస్టీ కమిషన్ ముందు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హామీలను తప్పక అమలు చేస్తా

ఎంపీ రఘునందన్‌రావు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న రఘునందన్‌రావు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తానని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. తెల్లాపూర్ పట్టణ ప్రజల అత్యవసర సేవల కోసం గురువారం ఆయన నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి సమయంలో సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని.. ఇచ్చిన మాట మేరకు అంబులెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఈనెల 26న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

అర్హుల కోసం స్క్రీనింగ్

- 'డబుల్ బెడ్‌రూమ్' జాబితాపై అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- కొనసాగుతున్న అర్హుల తొలగింపు ప్రక్రియ
- విచారణ అనంతరమే పంపిణీకి ముహూర్తం



పంపిణీ వాయిదా వేయడంతో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు(ఫైల్)

జహీరాబాద్: అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టబెట్టేందుకు రెవెన్యూ శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. జాబితాలో కొందరు అనర్హులకు చోటు కల్పించారని వచ్చిన ఆరోపణల మేరకు ఇళ్ల పంపిణీని నిలిపివేశారు. తాజాగా లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసేందుకు రెవెన్యూ శాఖ నడుం బిగించింది. మండలంలోని హోతి(కె) గ్రామంలో 660 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం ముంచుకువస్తున్న క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకుగాను అసంపూర్తిగా ఉన్న ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అర్హులను గుర్తించారు. గుర్తించిన వారిలో అందుబాటులో ఉన్న వారికి పట్టా సర్టిఫికెట్లను సైతం పంపిణీ చేశారు. మిగిలిపోయిన వారిని వారి అడ్రస్‌లు, ఫోన్ నంబర్ల ఆధారంగా గుర్తించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేసినా లబ్ధిదారులందరినీ గుర్తించలేక పోయారు. దీంతో వారిస్థానంలో మిగతా వారి పేర్లను చేర్చి జాబితా తయారు చేశారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అప్పటి జాబితాల్లో ఉన్నవారిలో నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లు పంపిణీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే అనర్హుల జాబితాను సైతం సిద్ధం చేయనున్నట్లు తెలిసింది. ముందుగా అర్హులైన వారికి ఇండ్లను కేటాయించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

హామీతో ఆందోళన విరమణ

హోతి(కె) గ్రామ శివారులో నిర్మించిన 66 ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులకు తాళాలు అప్పగించలేదు. లబ్ధిదారులు ఆందోళన చేపట్టడంతో అధికార యంత్రాంగం దిగివచ్చి ఎట్టకేలకు ఈనెల 12వ తేదీ ముహూర్తం ఖరారు చేసింది. అయినా అప్పగించకుండా వాయిదా వేసింది. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద, ఆర్డీఓ కార్యాలయం వద్ద లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. దీంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఇళ్ల పంపిణీకి మరోమారు తేదీని ఖరారు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అనర్హుల ఏరివేత

జాబితాలో అనర్హులు ఎంతమంది ఉన్నారనే దానిపై అధికారులు స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రజలు అందించే ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఫిర్యాదులు అందిన వారికి సంబంధించి రెవెన్యూ శాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరమే వారికి ఇళ్ల కేటాయింపు విషయాన్ని పరిశీలిస్తారు.

ప్రత్యేక కౌంటర్‌లో పేర్ల పరిశీలన

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీని వాయిదా వేయడంతో లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి జాబితాల్లో తమ పేర్లు ఉన్నదీ లేనిది చూసుకుంటున్నారు. ఎక్కడ తమ పేర్ల గల్లంతవుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. లబ్ధిదారుల కోసం కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో మంజూరైన లబ్ధిదారుల జాబితాను అక్కడ అందుబాటులో ఉంచారు. సర్టిఫికెట్లను తీసుకువచ్చి సరిచూసుకుంటున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద కౌంటర్‌లో పేర్లు సరిచూసుకుంటున్న లబ్ధిదారులు

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

జహీరాబాద్ టౌన్: ప్రతీ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జీ సౌజన్య పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో నిర్వహించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు సామాజిక,చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్గి ఉండటం అవసరమని చెప్పారు. డీడబ్ల్యూఓ లలిత కుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పిల్లల్లో పోషణలోపం ఉన్న వారిని గుర్తించి వారి బరువు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నన్ను నిద్ర లేపితే చుక్కలు చూపిస్తా

కేటీఆర్, హరీశ్‌కు మైనంపల్లి హెచ్చరిక

మెదక్‌జోన్: 'నన్ను నిద్ర లేపితే.. బావ, బామ్మర్దికి చుక్కలు చూపిస్తా'అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందన్నారు. దీంతో మళ్లీ ఆంధ్రా, తెలంగాన సెంటిమెంట్‌ను రగిలిస్తున్నారని ఆరోపించారు. అయినా ప్రజలు వారి మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్ఎస్ నేతలంతా ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈనెల 19న మరోమారు గాంధీభవన్‌లో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని తెలిపారు.

ఐదేళ్ల జైలు శిక్ష

బాలికపై లైంగిక వేధింపు కేసులో న్యాయమూర్తి తీర్పు

జిన్నారం (పటాన్‌చెరు): బాలికపై లైంగిక వేధింపుల కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలుశిక్ష,, రూ. 5వేల జరిమానా విధించినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2015 సంవత్సరంలో గుమ్మడిదల మున్సిపాలిటీ అన్నారం పరిధిలోని ప్రకృతి నివాస్లో నివాసముండే ఎనిమిదేళ్ల బాలికపై, పక్క ఇంట్లో నివాసం ఉండే కేళ్ళ సూర్యారావు (65) లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు.. న్యాయస్థానంలో చార్జ్ దాఖలు చేశారు. పూర్వాపరాలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి జయంతి నిందితుడికి పై జరిమానా విధించారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన న్యాయవాది సూర్ రెడ్డి, ఇన్వెస్టిగేషన్ అధికారి ఎస్ఐ లాలూ నాయక్, గుమ్మడిదల ఎస్ఐ భరత్ భూషణ్, కానిస్టేబుల్ శంకర్, సత్యనారాయణలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

తల్లీకూతురు అదృశ్యం



దివ్య (కూతురుతో)

కొండపాక(గజ్వేల్): ఓ మహిళ తన కూతురుతో కలసి అదృశ్యమైంది. ఈ సంఘటన కొండపాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. సిర్సనగండ్లకు చెందిన దివ్య ఈనెల 15న వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వెళ్తున్నానంటూ భర్త సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేసింది. కారు డ్రైవర్‌గా పని చేస్తున్న సంతోష్.. తాను సిద్దిపేటలోనే ఉన్నా.. ఆటోలో రమ్మన్నాడు. దీంతో దివ్యతో పాటు ఐదేళ్ల కూతురును తీసుకొని వస్తున్నానని చెప్పి రాలేదన్నారు. ఆమె ఆచూకీ కోసం యత్నించినా ఫలితం దక్కలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ కాలుపై నుంచి వెళ్లిన బస్సు

హత్నూర(సంగారెడ్డి): మహిళ కాలుపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హత్నూర మండలం వడ్డేపల్లి చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది. పటాన్‌చెరు నుంచి దౌల్తాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సులో నిజాంపేట్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన సాదినేని రత్నకుమారి వడ్డేపల్లి చౌరస్తాలో బస్సు దిగి ముందుకు వెళుతోంది. ఇంతలోనే బస్సు కదలడంతో టైరు మహిళ కాలుపై పోవడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. ఆమెను 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .కేసు దర్యాప్తులో ఉంది.

ఆటో బోల్తా .. కూలీ మృతి


కనుకవ్వ

కొమురవెల్లి(సిద్దిపేట): ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరి కొంత మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పోసాన్‌పల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లికి చెందిన కూలీలు కొమురవెల్లి మండలం రాంసాగర్‌కు వరినాట్లు, పత్తికలుపు తీయడానికి ప్రతిరోజు ఆటోలో వెళుతుంటారు. ఈ క్రమంలో గురువారం కూడా 15 మంది కూలీలు వెళుతుండగా.. మండలంలోని పోసాన్‌పల్లి శివారులోకి రాగానే అడ్డొచ్చిన కుక్కను తప్పించే క్రమంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు కూలీలకు తీవ్ర గాయలయ్యాయి. వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. భూమల్ల కనకమ్మ (55) మృతి చెందింది. మిగతావారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): మేడ్చల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. చేగుంట వినాయక్‌నగర్‌కు చెందిన మ్యాకల రాములు (55) విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ పనులు చేస్తూ, విద్యుత్ బిల్లులు తీసే మిషన్లను రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మేడ్చల్ జిల్లా కండ్లకొయ్యలోని కార్యాలయంలో బిల్లులు తీసే మిషన్లకు సంబంధించిన విడి పరికరాలను తీసుకొని చేగుంటకు బైక్‌పై తిరిగివస్తున్నాడు. ఈక్రమంలో లారీ ఢీకొని కిందపడిన రాములు తలపై నుంచి వెనకాల వస్తున్న ట్యాంకర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పేదోలు నివాసం ఉంటున్న గుడిసె



గూడు లేదు.. గుంట భూమీ లేదు

పేదల దరి చేరని ప్రభుత్వ పథకాలు

- పూరి గుడిసెల్లో దుర్భర బతుకు
- కలల గూడు సాకారమయ్యేనా..!

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పేదోళ్ల తలరాతలు మాత్రం మారడం లేదు. పేరుకే పేదల కోసం పథకాలు.. కానీ వారికి మాత్రం పథకాలు అందడం లేదు. సాగు చేసేందుకు గుంట భూమి లేక.. ఉండేందుకు సరైన గూడు లేక ఏళ్లతరబడి గుడిసెలు, రేకుల కొట్టాల్లోనే జీవిస్తున్నారు. కూలీ చేస్తేనే కుటుంబ పోషణ.. లేదంటే ఉపవాసం ఉండాల్సిన దయనీయ పరిస్థితి వారిది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బతుకు బండిని లాగిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లతో కలల గూడు సాకారమవుతుందని కలలు కన్న పేదల పగటి కలగానే మిగిలిందని పేదలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని 28 మండలాల ప్రజలు ప్రజాపాలన కింద ఇందిరమ్మ ఇళ్లకు 2 లక్షల 30 వేల 483 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేపట్టారు. మూడు విభాగాలుగా లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు గ్రామ సభల ద్వారా కూడా ఎంపిక చేశారు. 86,968 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వనున్నారు. కాగా గుంట భూమి లేని వారు జిల్లాలో 16,505 మంది ఉన్నారని అధికారులు గుర్తించారు. వీరిలో ప్రస్తుతం కొంతమందికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా ఇంకా చాలా మంది పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలో మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో గుంట భూమి లేని పేదలు దాదాపుగా యాభై కుటుంబాల వరకు ఉన్నాయి. ఇది అనధికారం మాత్రమే. అధికారంగా ఎక్కువగానే ఉంటాయని చెబుతున్నారు. ప్రజాపాలనలో అందరిలాగే ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 9,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎల్ వన్ కింద 3319, ఎల్ టు 806, ఎల్ 5,460 విభజించారు. ఎల్ వన్ నుంచి పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో 77 మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. అలాగే మండల వ్యాప్తంగా 415 మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు.


పూరిగుడిసెలో ఉంటున్న సుగుణ కుటుంబ సభ్యులు


అగ్గీరేకుల ఇంటిలో నివాసం ఉంటున్న సంతోష

గుంట భూమిలేదు

గుంట భూమి లేదు. భర్త, కొడుకు గ్రామంలో ఉపాధి హామీ పనులతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. చిన్నపాటి రేకుల ఇంటిలోనే చాలా ఏళ్ల నుంచి తలదాచుకుంటున్నాం. వర్షాకాలం అయితే ఇంట్లోకి వర్షం నీరు వస్తుంది. ఇందిరమ్మ ఇల్లు వస్తదని అనుకున్నాం. కానీ రాలేదు. మాలాంటి పేదోళ్లకు ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తే మంచిగుంటుంది.

– సంతోష, రాయవరం

ప్రభుత్వం స్పందించాలి

మాది చాలా నిరుపేద కుటుంబం. మండలంలోని ఎక్కడ మా కులపోళ్లు(దక్కలి) ఎక్కడ లేరు. ఇక్కడే ఉన్నం. కూలీనాలి పనులు చేసుకుంటూ ఉంటున్నాం. చేసిన కష్టం పూటకే సరిపోతుంది. పూరి గుడిసెలోనే ఉంటున్నాం. ప్రభుత్వమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

– సుగుణ, మునిగడప

విడతల వారీగా ఇళ్లు అందిస్తాం

అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తాం. ఇంటింటా సర్వే వివరాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరిగింది. అర్హులై ఇల్లు రానివారుంటే వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం. ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలించి ఎంపిక చేస్తాం.

– రాంరెడ్డి, ఎంపీడీఓ, జగదేవ్‌పూర్

ములుగు వర్సిటీకి అవార్డు


అవార్డును అందుకుంటున్న వీసీ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): ఐఐటీ బాంబే నుంచి ఓపెన్ సోర్స్ సాఫ్టవేర్ ఎడ్యుకేషన్ కేటగిరిలో ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉత్తమ యూనివర్సిటీ అవార్డు అందుకుంది. గురువారం ఐఐటీ ముంబైలో జరిగిన ఓపెన్–సోర్స్ జీఐఎస్ దినోత్సవ వేడుకలు, నేషనల్ జియోస్పెషియల్ అవార్డును ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. జియోస్పేషియల్ చొరవలు, క్రియాశీల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించడంలో ఆదర్శప్రాయమైన మద్దతును గుర్తించి ఐఐటీ ముంబై ఉద్యాన వర్శిటీ ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన రంగంలో భౌగోళిక సమాచార వ్యవస్థ, జీఐఎస్ మ్యాపింగ్ ప్రాముఖ్యతను అందించడంలో ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. ఇప్పటికే ఉద్యాన తోటలను మ్యాపింగ్ చేయడం, తెలంగాణ ఉద్యాన రంగంలో అప్లికేషన్‌లను ముమ్మరం చేసి రైతులకు సాగును లాభసాటిగా మార్చేందుకు ఇవి ఉపయోగపడుతాయని ఆయన వివరించారు. త్వరలోనే విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జీఐఎస్ హ్యాకథాన్‌ను కూడా నిర్వహిస్తామని వీసీ పేర్కొన్నారు. అలాగే.. ఎక్సలెన్స్ ఇన్ ఔట్‌రీచ్ అవార్డును కన్సల్టెంట్ డాక్టర్. వీరాంజనేయులకు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టితల్లి తలకొరివి పట్టి..


తండ్రి అంతిమయాత్రలో కూతురు శ్రావణి

- కన్నతండ్రి అంత్యక్రియలు నిర్వహించి..
- రుణం తీర్చుకున్న తనయ
- అనంతగిరిపల్లిలో విషాదం

వర్గల్(గజ్వేల్): తండ్రి మరణం.. పుట్టెడు దుఃఖం తనలోనే దిగమింగుకుంది. తానే కొడుకై ంది.. తలకొరివి పట్టింది. తండ్రి అంత్యక్రియలు నిర్వహించి కన్నతండ్రి రుణం తీర్చుకున్నది. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకున్నది. గ్రామానికి చెందిన బండ్ల సత్యనారాయణ(40), కవిత దంపతులకు కల్యాణి(18), ఉమ(15), శ్రావణి(13) ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. దురదృష్టం వెన్నంటి రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వెన్నెముకకు గాయంతో మంచానికే పరిమితమయ్యాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో కొంత అమ్మేసి వైద్యం చేయించనప్పటికి నయం కాలేదు. ఇటీవలే మరికొంత భూమి అమ్మి పెద్దకూతురు పెండ్లి చేశారు. మరోవైపు సత్యనారాయణ ఆరోగ్యం మరింత విషమించింది. బుధవారం మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం పెద్దదిక్కును, మగ దిక్కును కోల్పోయింది. దుఃఖసాగరంలో మునిగిపోయింది. కొడుకులు లేకపోవడంతో చిన్నకూతురు శ్రావణి దుఃఖాన్ని దిగమింగుకుని గురువారం తలకొరివి పట్టింది. తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. తండ్రి రుణం తీర్చుకున్నది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకున్నది.

భగ్గుమన్న భూ తగాదాలు

- ముందుగా దాడి.. ఆపై కారుతో ఢీకొట్టిన ప్రత్యర్థులు
- బాధితుడికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

కొమురవెల్లి(సిద్దిపేట): భూతగదాలతో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయినాపూర్‌కు చెందిన అలేటి రాంరెడ్డి, నాయిని ప్రతాప్ రెడ్డిలకు కొంత కాలంగా భూతగదాలు ఉన్నాయి. రాంరెడ్డి గురువారం స్థానిక దుకాణంలో మద్యం తాగుతుండగా.. ప్రతాప్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేశారు. భయాందోళన చెందిన రాంరెడ్డి.. ప్రాణాపాయం నుంచి తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ప్రత్యర్థులు అతనిని కారుతో వెంబడించి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఢీకొట్టారు. దీంతో రాంరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయపై ఎస్ఐ రాజును వివరణ కోరగా.. స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఇరువురు మద్యం తాగి ఉన్నారని, బాధితుడిని చికిత్స నిమిత్తం, మద్యం సేవించిన ప్రతాప్ రెడ్డిని పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాటువేసి కత్తితో దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న లక్ష్మణ్

రాయికోడ్(అందోల్): ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పీపడ్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మణ్ బుధవారం రాత్రి తన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ముందుగానే మాటువేసిన ఇస్మాయిల్ పదునైన కత్తితో లక్ష్మణ్ కడుపులో పొడిచాడు. దీంతో పేగులు బయటకు వచ్చి తీవ్ర రక్తస్రావమైంది. భయాందోళనతో ఒక్కసారిగా బెంబేలెత్తిపోయిన లక్ష్మణ్.. పెద్దగా కేకలు వేస్తూ ఇంటికి చేరుకున్నాడు. వెంటనే అతడిని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాత కక్షల నేపథ్యంలో ఈ హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు, ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

బాకీ డబ్బుల కోసం గొడవ

నర్సాపూర్ రూరల్: కల్లు సీసాతో వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్‌లో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల నిరంజన్ బుధవారం మధ్యాహ్నం కల్లు తాగేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న వడ్ల శివ ను తనకు రావాల్సిన బాకీ డబ్బులను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కోపోద్రిక్తుడైన శివ.. సీసాను పగులగొట్టి నిరంజన్‌ను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో నిరంజన్ కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో హుస్నాబాద్‌కి మొదటి ర్యాంక్

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ–సర్వేక్షన్ 2024–25 సర్వేలో సిద్దిపేట జిల్లా స్థాయిలో హుస్నాబాద్ మున్సిపాలిటీ మొదటి ర్యాంక్ సాధించింది. జాతీయ స్థాయిలో 4,900 పైగా మున్సిపాలిటీలు పోటీ పడ్డాయి. జాతీయ స్థాయిలో హుస్నాబాద్ మున్సిపాలిటీకి 139వ ర్యాంక్ దక్కింది. అలాగే తెలంగాణ రాష్ట్ర స్థాయిలో మొత్తం 150 మున్సిపాలిటీలతో పోటీ పడి 9వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే హుస్నాబాద్ మున్సిపాలిటీ ఓడీఎఫ్‌లో డబుల్ ప్లస్ సర్టిఫికెట్ పొందింది. ర్యాంక్ సాధి ంచడానికి సహకరించిన వారందరికి మున్సి పల్ కమిషనర్ మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఓఈని సందర్శించిన డైరెక్టర్


పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న యాస్మిన్

ములుగు(గజ్వేల్): ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా గురువారం సాయంత్రం ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్‌ను సందర్శించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. అనంతరం కూరగాయలు, పండ్ల మొక్కల నర్సరీలను పరిశీలించారు. కేసరి రకాల మామిడి అంటు కట్టు విధానం, వెదురు పెంపకాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సునీత, సీఓఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, ఉద్యాన శాఖ అధికారులు ఆశీష్, హారిక తదితరులు పాల్గొన్నారు.

46కు చేరిన సిగాచి మృతుల సంఖ్య..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 46 కు చేరింది. తీవ్ర గాయాల పాలై హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో మృతి చెందిన మరో కార్మికుడు గురువారం మృత్యువాత పడ్డారు.

సైబర్ నేరగాళ్ల మోసం

- ఆన్‌లైన్ ద్వారా ఫోను కొనుగోలు
- లబోదిమంటున్న బాధితుడు


ఫోన్‌ను చూపిస్తున్న ఆవుల శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆవుల శ్రీనివాస్. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామం. అయితే, బజాజ్ ఈఎంఐ కార్డును సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఆన్‌లైన్ ద్వారా రూ.34వేల విలువల గల ఫోన్‌ను కొనుగోలు చేశారు. గురువారం ఫ్లిప్ కార్టు డెలివరీ బాయ్ ఆ ఫోన్‌ను తీసుకొని ఇంటికి వచ్చాడు. ఆన్‌లైన్ ద్వారా మీరు ఫోన్ కొనుగోలు చేసుకున్నారని చెప్పడంతో ఒక్కసారిగా శ్రీనివాస్ కంగుతిన్నాడు. తాను ఆన్‌లైన్‌లో ఎలాంటి ఫోన్ కొనుగోలు చేయలేదని ఎంతచెప్పినా ఆర్డర్ క్యాన్సిల్ కాదనడంతో చేసేది లేక ఆ ఫోన్‌ను తీసుకున్నాడు. ఈ క్రమంలో వెంటనే మరో ఫోన్ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు, హైదరాబాద్ అడ్రస్‌తో మెసేజ్ రావడంతో శ్రీనివాస్ అవాక్కయ్యాడు. సైబర్ నేరగాళ్లు బజాజ్ కార్డును హ్యాక్ చేసినట్లు గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అటెండర్ ఆత్మహత్యాయత్నం

అక్కన్నపేట(హుస్నాబాద్): రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వేధింపులు భరించలేక అటెండర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీనియర్ అసిస్టెంట్ కవిత తనను నిత్యం టార్గెట్ చేస్తూ వేధింపులకు గురి చేస్తుందని అటెండర్ సరిత వాపోయింది. సూటిపోటి మాటలతో ఇబ్బందులకు గురి చేస్తుందని, రూ.4వేలు ఇస్తేనే జీతం బిల్లులు చేసిందన్నారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్‌కు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని వాపోయింది. వేధింపులు రోజురోజు పెరిగిపోవడంతో బాధ భరించలేక నిద్రమాత్రలు మింగానన్నారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

భార్య కాపురానికి రావడం లేదని...

సిద్దిపేటకమాన్: భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపానికి చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో పత్రి దినేష్ (25) భార్య, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. దినేష్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజులుగా భర్త ఏ పని చేయడం లేదంటూ, ఇంట్లో ఆర్థిక సమస్యలు ఉన్నాయంటూ దినేష్‌తో గొడవ పడుతుండేది. నెల రోజుల క్రితం ఇదే విషయంపై గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో దినేష్ తీవ్ర మనస్తాపానికి గురై ఇంటి బయట ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఖాతా చూసి కంగుతిన్న రైతు

- పంట రుణం రూ.48వేలు
- బ్యాలెన్స్ చూస్తే మైనస్ రూ.లక్ష

చేర్యాల(సిద్దిపేట): ఎస్‌బీఐ బ్యాంకు అధికారుల తీరుతో ఓ రైతు అవాక్కయ్యాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాలకు చెందిన దాసరి చంద్రయ్య స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో గతంలో రూ.48వేలు పంట రుణం తీసుకున్నాడు. సకాలంలో చెల్లించలేదన్న సాకుతో బ్యాంక్ అధికారులు రైతుకు చెందిన పొదుపు ఖాతా నిలిపివేశారు. అలాగే.. ఖాతాలో మైనస్ రూ.లక్ష చూపెట్టారు. దీంతో అవాక్కయిన రైతు.. ఇటీవల బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌ను సంప్రదించారు. నీకు పంట రుణం ఉంది..అందుకే మైనస్ బ్యాలెన్స్ చూపిస్తుందని చెప్పారు. తాను తీసుకున్న రుణం రూ.48వేలు అయితే రూ.లక్ష ఎందుకు మైనస్ చూపిస్తుందని అడగగా ఒక్కొక్క రైతుకు నిర్ణీత అమౌంటు పెట్టలేం . అందరికి కామన్‌గా రూ.లక్ష పెట్టామని సమాధానం వచ్చింది. మేనేజర్ ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందక గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, చాలా మంది రైతులకు తమకు ఉన్న లోన్ కంటే ఎక్కువ మైనస్ బ్యాలెన్స్ చూపిస్తున్నట్లు సమాచారం.

ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటాం

- చందన బ్రదర్స్ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్
- మెదక్‌లో షాపింగ్ మాల్ ప్రారంభం


జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్స్‌ను ప్రారంభిస్తున్న నటి వైష్ణవిచైతన్య, వర్షా తదితరులు

మెదక్‌జోన్: మెదక్‌లో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ (సీబీఎస్)ను ప్రముఖ నటి వైష్ణవిచైతన్య, టీవీ చానల్స్ నటి వర్షా, నూకరాజు గురువారం ప్రారంభించారు. వీరిని చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలిరావటంతో సందడి నెలకొంది. సెల్ఫీలు దిగేందుకు యువత పోటీపడ్డారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ.. తమ సంస్థలను తెలుగు రాష్ట్రాలలో ప్రారంభించిన ప్రతి చోటా అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందుతున్నాయని చెప్పారు. మెదక్‌లో కూడా ప్రజల ఆదరాభిమానాలు చూరగొనేలా వస్త్రాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఇక్కడి ప్రజల ఆదాయ వనరులకు అనుగుణంగా ధరలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆషాఢం, శ్రావణ మాసం వేడుకల సందర్భంగా అన్ని రకాల వస్త్రాలపై తగ్గింపు ధరలతో వినియోగదారులను అందిస్తామన్నారు.

ఆదాయం కోసం ప్యాకేజీ అస్త్రం

- ఆర్టీసీ వినూత్న ప్రయోగం
- దుబ్బాక డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు బస్సులు
- ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో ఆకర్షించుకునేందుకు యత్నం

అరుణాచలం, తిరుపతి, బీదర్ తదితర టూర్లకు బస్సులు


దుబ్బాక ఆర్టీసీ డిపో

దుబ్బాక: నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల బాటలోకి తెచ్చేందుకు టీఎస్ ఆర్టీసీ వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ డిపోలకు ఆదాయ మార్గాలను సమకూర్చుకునేందుకు సరికొత్త పంథాను ఎంచుకుంది. ఇందులో భాగంగా కొత్తగా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తుంది. ప్యాకేజీల పేరిట ప్రయాణికులను ఆకర్షించుకునేందుకు యత్నిస్తోంది. దుబ్బాక డిపో నుంచి ఆయా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తూ ప్రయాణికులకు మంచి సౌకర్యంతో పాటు లాభాలు ఆర్జిస్తోంది.

దుబ్బాక టూ అరుణాచలం

దుబ్బాక బస్సు డిపో నుంచి ప్రత్యేకంగా టూర్ ప్యాకేజీలను ప్రారంభించారు. ఇందులో భాగంగా జూన్ 27న ప్రముఖ పుణ్యక్షేత్రం తమిళనాడులోని అరుణాచలంకు దుబ్బాక నుంచి బస్సును ప్రారంభించారు. ఈ ప్యాకేజీ బస్సు ప్రయోగం సక్సెస్ కావడంతో ఇంకా మరిన్ని పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపాలనే ఆలోచనలతో పలు ప్రాంతాలకు కొత్తగా బస్సులు నడిపించేందకు ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

తిరుపతి, అరుణాచలం, బీదర్‌లకు కొత్తగా బస్సులు

దుబ్బాక డిపో నుంచి అరుణాచలంతో పాటు తిరుపతి, బీదర్ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలకు బస్సులు నడిపించేందుకు డిపో అధికారులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా నెలకు రెండు పర్యాయాలు డిపో నుంచి ఈ టూర్లకు బస్సులు నడిపించేందుకు పథకాన్ని సిద్ధం చేశారు. ప్రతి నెలలో రెండు సార్లు సాయంత్రం 3 గంటలకు దుబ్బాక నుంచి అరుణాచంలకు డీలక్స్ బస్సు బయలు దేరుతుంది. సిద్దిపేట, హైదరాబాద్ మీదుగా జోగులాంబ ఆలయం, కాణిపాక ఆలయం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలంకు.. తిరుగు ప్రయాణంలో తిరుపతి దేవాలయాలు దర్శనం చేసుకొని 4 రోజులుకు తిరిగి దుబ్బాకకు చేరుకుంటుంది. ఇట్టి ప్యాకేజీలో సూపర్ లగ్జరీ బస్సు పెద్దలకు రూ.5,200, పిల్లలకు 2,700 నిర్ణయించారు. అలాగే దుబ్బాక టూ బీదర్‌కు ఝరాసంగంలోని సంగమేశ్వర ఆలయం, జల లక్ష్మీనర్సింహస్వామి బీదర్‌కు ఒక రోజు ప్యాకేజీతో డీలక్స్ బస్సును వేశారు. ఉదయం ఐదు గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు తిరిగి చేరుకుంటుందని, ఇందుకోసం పెద్దలకు రూ.1,100, పిల్లలకు రూ.600 ప్యాకేజీ పెట్టారు.

విస్తృతంగా ప్రచారం

దుబ్బాక డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు కొత్తగా ప్రారంభించిన టూర్ ప్యాజీలపై ఆర్టీసీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుంది. ప్రత్యేకంగా సోషల్ మీడియా, వాట్సాప్ ఫేస్‌బుక్‌లతో పాటు ఆకర్షణీయమైన కరపత్రాలతో టూర్లపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏ గ్రామం నుంచైనా 36 మంది ప్రయాణికులుంటే ఆ గ్రామం లేద ఆ కాలనీ నుంచే బస్సు పెడుతామంటున్నారు. ఈ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు ముందుగా తమ పేర్లను బుక్ చేసుకోవాలి. ఇందు కోసం ప్రత్యేక నెంబర్లు 99592 26271, 86392 07675, 73828 29973 లను సంప్రదించాలి.

భక్తుల సౌకర్యార్థం కోసమే..



భక్తుల సౌకర్యార్థం దుబ్బాక డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నాం, అరుణాచలం, తిరుపతి, బీదర్ ప్రాంతాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సులు వేయడం జరిగింది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి సహకరించాలి.

– రఘురాం, డీఎం